ఈనాడు

# ఏపీ ఎంసెట్‌కు 2.74 లక్షల దరఖాస్తులు

## కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు వెల్లడి

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఏపీ ఎంసెట్‌కు ఇప్పటివరకు మొత్తం 2,74,756 మంది దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు తెలిపారు. ఇంజినీరింగ్‌లో 1,98,112 మంది, వైద్య, వ్యవసాయ విభాగంలో 75,550 మంది, రెండు విభాగాలకు కలిపి 1,094 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇంజినీరింగ్‌కు ఏప్రిల్ 22 నుంచి 24 వరకు, వైద్య, వ్యవసాయ విభాగాలకు సంబంధించి 25వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ నెల 16 వరకు రూ.5 వేలు, ఈనెల 21 వరకు రూ.10 వేల అపరాధ రుసుముతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 18 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ పరీక్ష రాస్తున్న వారిలో ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థులతోపాటు ఇతర బోర్డుల విద్యార్థులు సుమారు 11 వేలమంది ఉన్నారని, వీరంతా హాల్‌టికెట్‌తో పాటు డిక్లరేషన్ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0884-2340535, 2356255 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+8+16 వెల: ₹ 5.00



'ఎన్ని కరువులనైనా ఎదుర్కొగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

# ఎంసెట్‌కు 2.74 లక్షల దరఖాస్తులు

- ఏప్రిల్ 22 నుంచి 25 వరకు ఆన్‌లైన్లో పరీక్షలు
- 18 నుంచి హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం
- ఒక్కనిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు
- మెహందీ పెట్టుకోకూడదు, టాటూలు వేసుకోరాదు

సాక్షి, అమరావతి:/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఎంసెట్-2018 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆన్‌లైన్ పద్ధతిలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 22 నుంచి 24 వరకు ఇంజినీరింగ్, 25న అగ్రికల్చర్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తారు. ఇప్పటి వరకు మొత్తం 2,74,756 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఇంజినీరింగ్‌కు 1,98,112, అగ్రి, డెంటల్ తదితర కోర్సులకు 75,550, రెండింటికీ కలిపి 1094 దరఖాస్తులు వచ్చాయని ఎంసెట్ చైర్మన్ ఎస్.రామకృష్ణా రావు, కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్.సాయిబాబు పేర్కొన్నారు. రూ. 5 వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 16వ తేదీ వరకు, రూ. 10 వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. హాల్ టిక్కెట్లను ఈనెల 18 నుంచి ఎంసెట్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో విద్యార్థి ఎంపిక చేసుకున్న మూడు రీజనల్ సెంటర్లలో ఒక సెంటర్‌లోని పరీక్ష కేంద్రాన్ని దాదాపు అందరికీ కేటాయించినట్లు సాయిబాబు తెలిపారు. ఎంసెట్‌లో ఇంటర్మీడియెట్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఉంటుందని, ఈ మార్కులను ఇంటర్‌బోర్డు నుంచి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇతర బోర్డుల విద్యార్థులు దాదాపు 11 వేల మంది ఈసారి పరీక్షకు దరఖాస్తు చేశారన్నారు. వీరు హాల్‌టిక్కెట్లతో పాటు డిక్లరేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకొని ఈనెల 27వ తేదీలోగా ఆ ఫారంతో పాటు ఆయా బోర్డుల ఇంటర్ మార్కుల జాబితాలను ఎంసెట్ కార్యాలయానికి పోస్టు ద్వారా లేదా ఎంసెట్ ఈమెయిల్ ఐడీకి పంపించాలని కన్వీనర్ సూచించారు.



ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సాయిబాబు

స్క్రయిబ్ (సహాయకులు)లకోసం దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత విద్యార్థి ధ్రువపత్రాలతో ఈనెల 17లోగా ఎంసెట్ కార్యాలయానికి వచ్చి అనుమతి పొందాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ వల్ల విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా వారికి ముందుగానే దానిపై అవగాహన కోసం వెబ్‌సైట్లో మాక్ టెస్టులకు అవకాశం కల్పించారు. విద్యార్థులు పరీక్షకు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష హాలులోకి విద్యార్థి హాల్‌టిక్కెట్, ఎంసెట్ దరఖాస్తు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే కులధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. కాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాలులోకి అనుమతించరు. విద్యార్థి మెహందీ, గోరింటాకు పెట్టుకోరాదని, టాటూలు వేసుకోరాదని, ఒక్క నిముషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించబోమని కన్వీనర్ స్పష్టంచేశారు. వివరాలకు 0884-2340535, 0884-2356255 నెంబర్లలో లేదా 'ఏపీఈఏఎంసీఈటీ18 ఎట్‌ద జీమెయిల్.కామ్' ద్వారా సంప్రదించాలని కన్వీనర్ సూచించారు.